www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 25 జనవరి 2023
5
చిత్తూరు

ఘనంగా జాతీయ ఓటర్స్‌డే

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జాతీయ ఓటర్స్‌డేను బుధవారం ఘనంగా నిర్వహించుకుందామని జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి జాతీయ ఓటర్స్ డే కార్యక్రమంను బుధవారం ఉదయం 9.30గంటలకు గాంధీ సర్కిల్ నుంచి ర్యాలీగా విద్యార్థులతో మానవహారం నిర్వహించిన అనంతరం అంబేద్కర్ భవన్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీ పరిధి, డివిజన్‌స్థాయి, మండల స్థాయి, గ్రామస్థాయిలో జాతీయఓటర్స్‌డే నిర్వహించబడునన్నారు. జాతీయ ఓటర్స్ డే సందర్భంగా కొత్తగా ఓటరు కార్డు పొందిన యువఓటర్లకు, విభిన్న ప్రతిభావంతులకు, వయో వద్దా ఓటర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించి జాతీయ ఓటర్స్ డేకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుందని తెలిపారు.

లక్ష్యాలను పూర్తి చేయండి

జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్

ప్రజాశక్తి- పలమనేరు

పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా ఉగాది నాటికి ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ గృహ నిర్మాణశాఖ ఇంజనీర్లను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పలమనేరు లోగంటాపూరు సచివాలయ పనితీరు, నూతనంగా నిర్మిస్తున్న ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను, బొమ్మిదొడ్డి హౌసింగ్ లేఅవుట్‌లో ఇళ్లనిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గంటాపూరు సచివాలయంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా అర్హత, అనర్హత లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. స్పందన కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం పలమనేరులో నూతనంగా రూ.16 కోట్లతో నాబార్డు నిధులతో నిర్మిస్తున్న వంద పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రి పనులను వేగంగా పూర్తిచేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకొని వచ్చి వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని డిసిహెచ్ఎస్ డాక్టర్ నాయక్‌ను, ఏపిఎం ఐడిసి డీఈను ఆదేశించారు. తదుపరి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించి మధ్యాహ్న భోజనంను తనిఖీ చేశారు. విద్యార్థులకు రుచికరంగా భోజనాన్ని అందించాలని ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం కోడిగుడ్లు, చిక్కి విద్యార్థులకు అందజేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం బొమ్మిదొడ్డి హౌసింగ్ లేఅవుట్ పరిశీలించి ఇండ్ల నిర్మాణ పురోగతిని తనిఖీ చేశారు. ఈ బొమ్మిదొడ్డి లేఅవుట్‌లో మొత్తం 2086 ఇండ్లకు గాను 254 ఇండ్లు పూర్తి కాగా మిగిలిన ఇండ్లు వివిధ దశలలో కలవని గహ నిర్మాణ శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఉగాది నాటికి నిర్దేశించిన గహనిర్మాణ లక్ష్యాలను అధికారులు పూర్తిచేసే దిశగా ఇండ్ల నిర్మాణపురోగతిలో వేగంపెంచాలని గహ నిర్మాణశాఖ అధికారులతో పాటు ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఎంఈఓ లీలారాణి, హౌసింగ్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ

6న కలెక్టరేట్ ఎదుట ధర్నా

వర్కర్స్‌ను వేధిస్తున్న సిడిపిఓ పై చర్య తీసుకోవాలి
సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి- కుప్పం: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కారం కోసం కుప్పం ప్రాజెక్టు కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు అధ్యక్షత వహించిన సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, బకాయిలున్న రెండు నెలల వేతనాలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుప్పం ప్రాజెక్టులో అంగన్వాడీలను వేధిస్తున్న సిడిపిఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ వర్కర్ల హక్కులను కాలరాస్తూ, కక్ష్య సాధింపు చర్యలు చేపడుతున్న అధికారిపై జిల్లా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ సమస్యలు పరిష్కారం చేయకపోతే భవిష్యత్తులో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కేపీ.లలిత మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సమస్యలు పరిష్కారం కోసం ఫిబ్రవరి 6న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు అందరూ భారీస్థాయిలో కదిలి రావాలని పిలుపునిచ్చారు. కుప్పం అంగన్వాడీ నియోజకవర్గ అధ్యక్షురాలు ప్రమీల, అంగన్వాడీ యూనియన్ నాయకులు కస్తూరి, శారద అంగన్వాడీలు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంగరాజు

బంగారుపాళ్యం: అంగన్వాడీ కార్యకర్తలను పర్యవేక్షణ పేరుతో వేధించడం మానుకోవాలని సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి కాంచీవరం సురేంద్ర అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో జిల్లా అంగన్వాడీ నాయకురాలు వరలక్ష్మి ఆధ్వర్యంలో సిడిపిఓకి వినతిపత్రం అందించారు. అంగన్వాడీలు భారతి, లేపాక్షి, కళావతి పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో వినతి..

సిడిపివోకు వినతి

చిత్తూరుఅర్బన్: అంగన్వాడీల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మంగళవారం స్థానిక చిత్తూరు సిడిపివో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్, షకిల నేతృత్వంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి షకిల మాట్లాడుతూ స్త్రీశిశు సంక్షేమశాఖ పరిధిలో పనిచేస్తున్న అంగన్వాడీలు చిన్న పిల్లలకు అనేక సేవలు అందిస్తున్నా చాలీచాలని జీతాలు, నెలల తరబడీ అందని డిఏలతో అల్లాడుతున్నట్లు తెలిపారు. అనేక సెంటర్లలో మౌలిక వసతులు లేవని విద్యుత్ సౌకర్యం లేదని, విద్యుత్ కన్నెక్షన్ ఉన్న సెంటర్లకు ప్రభుత్వం నుండీ విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదన్నారు. సెంటర్లను సచివాలయ పర్యవేక్షణను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. రోజుకో అధికారి తనిఖీల పేరుతో అంగన్వాడీలను వేధింపులకు గురి చేస్తున్నారని యాప్‌ల పేరుతో ఒత్తిడి పెరుగుతోందన్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే పిభ్రవరి 6వ తేది స్త్రీశిశు సంక్షేమశాఖ పిడి కార్యాలయం ఎదుట ఆందలోళనకు పూనుకోనున్నట్లు హెచ్చరించారు. సిడిపివో శ్యామసుగుణకు వినతి పత్రం ఇచ్చారు. ప్రాజెక్టు నాయకులు సృజని, మమత, బుజ్జిలతో పాటు అంగన్వాడీలు పాల్గొన్నారు.

చిత్తూరులో వినతి..

నగరి: అంగన్వాడీ వర్కర్లకు ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో నగరి ఐసిడిఎస్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఐసిడిఎస్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేశ్, మండల కార్యదర్శి ఏఎస్ పెరుమాళ్ మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సమస్యలు పరిష్కారానికి వచ్చేనెల ఆరో తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు అంగన్వాడీ వర్కర్స్ భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ వర్కర్స్ పంచవర్ణం, ధనకోటమ్మ, వరలక్ష్మి, వనిత, శాంతి, నాగభూషణం, వర, తదితరులు పాల్గొన్నారు.



నగరిలో వినతి..

జాతీయ రహదారుల పనులు వేగవంతం చేయాలి

జాతీయ రహదారులను విస్తరణ పనులపై సమీక్షిస్తున్న జేసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల పనులను వేగవంతంగా పూర్తిచేసేలా చూడాలని జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఛాంబర్‌లో తనను కలిసిన జాతీయ రహదారుల పిడి కార్తికేయరెడ్డి తదితరులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారికి సంభందించి భూసేకరణ పనులను పూర్తి చేయడం జరిగిందని, పనులను వేగవంతం చేయాలన్నారు. అలాగే బెంగులూరు- చెన్నై ఎక్స్ప్రెస్ హైవే పనులు వేగవంతం చేస్తే బాగుంటుందని అన్నారు. దారిలో ఏమైనా సమస్యలుంటే సంబంధిత రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటారని అన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారులు అందుబాటులో ఉంటారని అన్నారు. కార్యక్రమంలో వారితో పాటు ఆర్‌డిఒ రేణుక పాల్గొన్నారు.

దళితవాడల్లో శ్మశాన వాటికలు తప్పనిసరి

జనాభా ప్రాతిపదికన స్థలాలు ఎంపిక : జెసి

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్:

రాష్ట్రప్రభుత్వం దళితవాడలకు సంబంధించి శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలని భావించిందని, అదేవిధంగా అర్హులైన వారికి అసైన్మెంట్ భూములను ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. జాయింట్ కలెక్టర్ మంగళవారం పెనుమూరు మండలంలో దళితవాడలకు సంబంధించిన శ్మశానవాటికలకు భూముల కేటాయింపు గురించి పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మొదట పెనుమూరు మండల కార్యాలయంలో తహశీల్దార్ విజయభాస్కర్‌తో పాటు ఇతర సిబ్బందితో సమావేశమయ్యారు. స్మశాన భూములు లేని గ్రామాలను గురించి వివరాలు అదేవిధంగా ఎంపిక చేసిన స్థలాలు ఇంకా ఎంపిక చేయాల్సిన గ్రామాలకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అమ్మగారిపల్లి, కత్తిరెడ్డిపల్లి, ఉగ్రహణంపల్లి, సన్యాసిపల్లి దళితవాడలకు శ్మశాన భూములను పరిశీలించారు. ఈసందర్భంగా స్థలం ఎంపిక చేసి గ్రామస్తులను ప్రజాప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. దీనికి సంబంధించి భూములను చదునుచేసి కేటాయించాలని అలా కేటాయించిన శ్మశాన వాటికలను సంబంధిత పంచాయతీలకు అప్పగించాలని తహశీల్దారును ఆదేశించారు. అదేవిధంగా కత్తిరెడ్డిపల్లి, బందార్లపల్లి, ఆర్కేపురం గ్రామాల వద్ద అసైన్మెంట్ భూములను పరిశీలించారు. ఇప్పటికే చాలామంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందని అందులో అర్హులైన వారిని గుర్తించి స్థలాల కేటాయింపు చేయాలని అన్నారు. లబ్ధిదారులు ఆ ప్రాంతాలకు వెళ్లి వచ్చేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రహదారి సమస్యలు ఏవైనా ఉన్నా వాటిని వెంటనే పరిష్కారం చేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి స్థలం చూపించి తగిన నిర్ణయం తీసుకోవాలని తహశీల్దార్, ఇతర అధికారులతో జాయింట్ కలెక్టర్ అన్నారు.

మత్స్యకారులు లబ్ది పొందేలా చూడాలి: జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో ఇటీవల కాలంలో భారీవర్షాలు నమోదు అయినందున మత్స్య సంపద వద్ది చెందిందని, చేపలను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని, ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని జాయింట్ కలెక్టర్ సమావేశ మందిరంలో మత్స్యశాఖ అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య యోజన పథకం ద్వారా మత్స్యకారులు లబ్ది పొందేలా చూడాలని తెలిపారు. చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు లక్ష నుండి కోటి రూపాయల వరకు రుణ సదుపాయం అందుబాటులోకి వచ్చిందని 40 నుంచి 60 శాతం వరకు రాయితీ ఇవ్వబడుతుందని తెలిపారు. మత్స్యకారులకు ప్రభుత్వం అందించే వివిధ రాయితీలపై మరింత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తద్వారా మరింత ఎక్కువ మంది లబ్ధిదారులకు రుణసదుపాయం కల్పించాలని అన్నారు. చిరువ్యాపారస్తులకు లాభదాయకంగా వుండేలా చూడాలని ఆ విధంగా అమ్మకాలను పెంచాలన్నారు. మహిళా సంఘాల వారికి రుణాలు ఇచ్చి తద్వారా మరింత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డిడి ఫిషరీస్ రవికుమార్ రెడ్డి, జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, డిఆర్డిఏ పిడి తులసి, వ్యవసాయశాఖ అధికారిని శ్రీదేవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శేషగిరీరావు, ఇరిగేషన్ ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసిపి తిరుగులేని విజయం సాధిస్తుంది: డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి- పాలసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను లబ్ధిపొందిన ప్రజలు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఘనవిజయం సాధిస్తుందని డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి కె.నారాయణస్వామి జోష్యం చెప్పారు. మంగళవారం వెంగళరాజుకుప్పం సచివాలయ పరిధిలోని గుట్టమీదఇల్లు, ఇందిరానగర్ ఆది ఆంధ్రవాడ, కన్నికాపురం, వీర్లగుడి గ్రామాల్లో ఎంపీపీ శ్యామల అశోక్ ప్రకాష్ రాజు, జడ్పిటిసి సభ్యులు అన్నాలగర్, వైస్ఎంపీపీ శేఖర్, పుష్ప, సర్పంచ్ లిల్లీ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు ఏ ముఖ్యమంత్రి చేయలేదని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. గ్రామాల్లోని ప్రతి గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో విద్యావతి, తహశీల్దార్ బాబు, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, ఏపీఎం ఫరీద్ మస్తాన, ఏపీఓ బాలా, వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రకాష్‌రాజు, ఎంపీటీసీ గోవిందరాజులు, సర్పంచులు భాస్కర్‌రెడ్డి, మహేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీస్తున్న డిప్యూటీ సీఎం

మార్చి 15 కల్లా ఇళ్ల నిర్మాణం పూర్తి: కమిషనర్

అనుపల్లి వద్ద గృహనిర్మాణాలను పరిశీలిస్తున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ మంగళవారం ఉదయం నగరంలో విస్తతంగా పర్యటించారు. సూర్యోదయ సమయానికే అనుపల్లి జగనన్న హౌసింగ్ కాలనీ సందర్శించారు. అటు నుండి డెంగీ కేసులు నమోదైన ఇరువారం, కట్టమంచి ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని తనిఖీ చేశారు. అనంతరం నగరపాలక వాహనాల షెడ్డులో వాటర్ వర్క్స్ మెటీరియల్స్, స్క్రాప్ ను పరిశీలించారు.

మార్చి 15 కల్లా ఇళ్ల నిర్మాణం పూర్తి

అనుపల్లి జగనన్న హౌసింగ్ కాలనీలో నిర్దేశించుకున్న 255 గహాలను మార్చి 15 కల్లా పూర్తిచేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ హౌసింగ్ అధికారులు, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. కమిషనర్ అనుప్పల్లి హౌసింగ్ లేఔట్‌లో హౌసింగ్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులతో సమీక్షించారు. లబ్ధిదారులు, మేస్త్రీలలో సమన్వయం చేసుకొని సకాలంలో పనులు పూర్తిచేసేలా పర్యవేక్షించాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడారు. హౌసింగ్ ఏఈ శ్రీధర్, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జ్వరాలపై ఇంటింటి సర్వే చేయండి

నగరంలో డెంగ్యూ జ్వరాల కేసులు నమోదు అవుతున్న దష్ట్యా అన్ని వార్డుల్లో ఇంటింటి ఫీవర్ సర్వేను చేపట్టాలని కమిషనర్ అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. డెంగీ కేసులు నమోదైన ఇరువారం, కట్టమంచి ప్రాంతాలను మంగళవారం ఉదయం కమిషనర్ పరిశీలించారు. కేసులు నమోదైన గహాల్లో దోమ లార్వాలను తనిఖీ చేశారు. దోమల నియంత్రణకు క్రమం తప్పకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫ్రైడే డ్రైడే పక్కాగా చేపట్టాలని, ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయాలని, తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని వార్డు కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహా పాల్గొన్నారు.

వెహికల్ షెడ్లో మెటీరియల్ పరిశీలన

నగరపాలక సంస్థ వాహనాల షెడ్డును కమిషనర్ పరిశీలించారు. నగరంలో నీటిసరఫరా, మరమ్మతుల కోసం తెప్పించిన పైపులు, మోటార్లు, ఇతర సామగ్రిని పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం వేలానికి సిద్ధం చేసిన స్క్రాప్ వస్తువులను తనిఖీ చేశారు. నిబంధనల మేరకు ప్రక్రియను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఎంఈ ధనలక్ష్మీ, డీఈ వెంకట ప్రసాద్, ఏఈ శ్రీలత పాల్గొన్నారు.

ప్రజలకు వైసీపీ సాయం చేస్తే..

టిడిపి ద్రోహం చేసింది : ఎమ్మెల్సీ భరత్

ప్రజాశక్తి- శాంతిపురం: 40 ఇయర్స్ ఇండస్ట్రీ.. అని చెప్పుకునే ఓ పెద్దమనిషి, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, 35సంవత్సరాలు శాసనసభ్యుడిగా పనిచేసినా ప్రజాసంక్షేమం కోసం ఏనాడు పాటుపడలేదని ఎమ్మెల్సీ కెఆర్‌జే భరత్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కర్లగట్ట గ్రామపంచాయతీలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం రెండవ రోజు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రజలతో మాట్లాడుతూ పసుపు కుంకుమ నిధులు ఎన్నికల ముందు ఇస్తానని హామీ ఇచ్చి మహిళలను మోసం చేసిన మహా మోసగాడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. ద్వాక్రా మహిళలందరూ ఒకసారి చంద్రబాబు గతాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. చంద్రబాబుది బీసీలపై ఉన్నది కపట ప్రేమని అన్నారు. 56 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వాటికి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి బీసీలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అండగా నిలిచారన్నారు. ఎస్సీ ఎస్టీ మైనారిటీలకు సైతం ప్రభుత్వ సంక్షేమపథకాలు అందజేయడంలో సామాజిక న్యాయం చేసిన వ్యక్తి జగనన్న అని స్పష్టం చేశారు. అంతకుముందు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్సీని ఆ పంచాయతీ సర్పంచ్ చంద్రకళా గోవిందరాజు, ఎంపీటీసీ అనితా చలం, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ భరత్ పంచాయతీలోని తమ్మిగానిపల్లి, కర్లగట్ట, ప్రీతిచామనూరు, చిన్నకర్లగట్ట, చీమనపల్లి, వెంకటాపురం, గ్రామాల్లోని ప్రజల వద్దకు వెళ్లి వారి కష్టసుఖాలను వాకబు చేశారు. జెడ్పిటిసిఎస్ శ్రీనివాసులు, ఎంపీపీ వసుంధర కోదండరెడ్డి, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వైస్ఎంపీపీ టీవీ.పట్టాభి, సర్పంచ్ చంద్రకళా గోవిందరాజు, ఎంపీటీసీ అనితాచలం, రాష్ట్ర పోలీస్‌శాఖ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమ్మ చెంగప్ప, ఒక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ విశాలాక్షి సుకుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు మునిరత్నం, తహశీల్దారు డి.లోకేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి అప్పోజి, గహనిర్మాణశాఖ అధికారి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

అంగవైకల్య విద్యార్థులు

27 లోపు సర్టిఫికెట్లు సమర్పించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో అంగవైకల్యం నమోదు చేసిఉంటే ఈనెల 27వ తేదీ లోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అంగవైకల్య ధృవపత్రాలను సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాల్యవివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు : పీడీ

బాలికల దినోత్సవం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐసిడిఎస్, బాల సురక్ష పథకం అధికారులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని స్త్రీశిశు సంక్షేమశాఖ పీడి నాగశైలజ హెచ్చరించారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక సంజయ్ నగర్‌లోని గురుకుల బాలికల విద్యాలయంలో జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీడి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ, పట్టణాల్లో బాల్య వివాహాలు నిర్వహించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామాల్లో 18 ఏళ్ళలోపు వయసున్న బాలికలకు వివాహాలు చేస్తుంటే విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు తెలియజేయాలని అన్నారు. బాల్యవివాహాలు నిర్వహించే తల్లిదండ్రులకు చట్టపరంగా శిక్ష పడుతుందని తెలిపారు. వరడు, వదువు తల్లిదండ్రుల నుండీ వివాహానికి అంగీకారపత్రం తీసుకోవాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయని, బాల్యవివాహాలకు సకరించే వారిపై కూడా కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఎవరైనా మైనర్‌ను వివాహం చేసుకుంటే ఫోక్సో చట్టం ప్రకారం పదేళ్ళు జైలు శిక్ష జరిమాన విధిస్తారని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని శాఖలు బాల్యవివాహాలను నిరోధించేందుకు క్షేత్రస్థాయిలో విస్తతంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి డాక్టర్ శివశంకర్, ఐసిడిఎస్ అధికారులు ప్రతిమ, కల్పన, దేవయాని, మురళి పాల్గొన్నారు.

సోమల: సమాజంలో బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరు తమవంతు బాధ్యతగా చర్యలు చేపట్టాలని మెరుగైన సమాజం కోసం చేతులు కలపాలని నంజంపేట ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుసుమాంబ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం జడ్పీ ఉన్నతపాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫ్లకార్డులతో విద్యార్థులకు బాలికల ఆవశ్యకత, బాల్య వివాహాల నిర్మూలన, బాలికా సంరక్షణ చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

రొంపిచెర్ల: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రాజా ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగింది.

కార్వేటినగరం: బాల్యవివాహాలను సంఘటితంగా అడ్డుకుని, బాలికల ఉన్నతికి, అభివద్ధికి ప్రతిఒక్కరు కషి చేయాలని ఉమెన్ ఎంపవర్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ సీఎన్.లత పేర్కొన్నారు. మంగళవారం కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు డాక్టర్ వెంకటేశన్, విష్ణుప్రియ, పావులూరి అశ్విని, జేకేసి మెంటర్ లోకేశ్వర్ విద్యార్థులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం గ్రామంలోని జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. హెల

జగనన్న గృహనిర్మాణ పనులు తనిఖీ

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మండలంలోని పెద్దకాల పంచాయతీ కనికలమ్మ కాలనీలో కొత్తగా జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో శ్రీదేవి మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలువురు ఇళ్ల నిర్మాణ లబ్దిదారులతో మాట్లాడి వారి వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుండి ఇంటి నిర్మాణ బిల్లులు వస్తున్నాయని పేర్కొన్నారు. పనులు వేగవంతంగా సాగించి పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్దకాల్వ సర్పంచ్ ఏకాంబరం, హౌసింగ్ ఏఈ శ్రీధర్ ఈఓపీఆర్డీ శివయ్య, హౌసింగ్ వర్క్ఇన్స్పెక్టర్ గీత, వీఆర్వో ప్రభావతి, సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండల కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఎంపీడీవో శ్రీనివాస్ విశ్వనాథ్, స్థానిక సర్పంచ్ అఖిలాజాఫర్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెద్దపంజాణి సర్పంచ్‌తో కలిసి పంచాయతీల్లోని గ్రామాల్లో గ్రామంలో తిరిగి పనులు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి త్వరగా పనులు పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎంపిడిఓగా భాధ్యతలు తీసుకున్న తర్వాత గహనిర్మాణశాఖపై సమీక్ష నిర్వహించి ఉగాది నాటికి 658 ఇళ్ళులు పూర్తి చేయడానికి గ్రామ సచివాలయం వారీగా స్వయంగా ప్రణాళికలు తయారు చేసి ఇంజనీరింగ్ అసిస్టెంటులకు ఇవ్వడం జరిగిందన్నారు. వాటి అమలు క్షేత్రస్థాయిలో ఎలా జరుగుతుందో పరిశీలించడానికి గ్రామ పర్యటన చేపట్టానన్నారు. ఇకపై ప్రతిరోజు ఒక సచివాలయం పరిధిలో పర్యటించి గహనిర్మాణ ప్రగతిని సమీక్షించడం జరుగుతుందని ఎంపిడిఓ తెలిపారు.

సోమల: మండలంలోని జగనన్న లేఅవుట్‌లో నిర్మాణాలను చేపట్టిన లబ్ధిదారులు ఈ ఏడాది ఉగాది లోపు గహ నిర్మాణాలను పూర్తి చేసి గహప్రవేశాలను నిర్వహించాలని ఎంపీడీవో నాగరాజు కోరారు. మంగళవారం మండలంలోని పెద్దఉప్పరపల్లి, ఇరికిపెంట పంచాయతీలలో లేఅవుట్లలో నిర్మాణాల పనితీరును పరిశీలించారు.

స్థానిక సమస్యలపై స్పందించాలి : ఎమ్మెల్యే

గ్రామాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: స్థానిక సమస్యలపై స్పందించాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని కీరమంద సచివాలయ పరిధిలోని వేపనపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఇన్చార్జ్ ఎంపీడీవో శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు మాట్లాడుతూ గ్రామసచివాలయ సిబ్బంది, వాలంటీర్లు గ్రామంలోని సమస్యలను గుర్తించాలని, వాటిని పరిష్కరించేందుకు ఉన్నత అధికారులకు సిఫార్సు చేసి గ్రామ సమస్యలను వెంటవెంటనే పరిష్కరించేందుకు పనులు చేయాలన్నారు. గ్రామంలోని మురుగునీటి కాలువలు తాగునీరు సమస్యలపై గ్రామస్తులు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించి గ్రామంలో సచివాలయ ప్రత్యేక నిధుల్లో మురుగునీటి కాలువలు నిర్మించాలని తాగునీరు సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ రాజాకు శాఖ అధికారులకు తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, ఏఎంసి చైర్మన్ నారే సోమశేఖర్, ఎంపీటీసీ రవీంద్ర హేమచంద్ర, తహశీల్దార్ బెన్‌రాజ్, ఎంఈఓ నాగేశ్వరరావు, ఏఈలు రామిరెడ్డి, శ్రీధర్, గుణశేఖర్ రెడ్డి, ఏపీఓ కిరణ్, ఏవో పద్మజా, ఐసిడిఎస్ సూపర్వైజర్ జయశ్రీ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- సోమల: సర్వేంద్రియానం నయనం (కన్ను) ప్రధానం అని సదుం జడ్పిటిసి సోమశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం ఊటుపల్లి పంచాయతీ బొమ్మిరెడ్డిగారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో తిరుపతి రుయా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల వారు కంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు ఇటువంటి వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకొని వైద్యం చేయించుకోవాలని ఎంపీపీ యల్లప్ప అన్నారు. ఈ వైద్యశిబిరంలో 61మంది వైద్యపరీక్షలు చేయించుకోగా 21 మంది కంటి ఆపరేషన్‌కు ఎంపికైనట్టు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సాధన, లీలావతి, కుస్మిత, సౌందర్య, శశిరేఖ, సుహాసిని, సర్పంచి మాజీ సర్పంచ్ ఎంపీటీసీలు గ్రామస్తులు పాల్గొన్నారు.

సిరి ధాన్యాల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి- గుడిపల్లి: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023లో భాగంగా మంగళవారం రోజున గుడిపల్లి మండలంలోని సంగనపల్లి, సోడిగానపల్లి గ్రామపంచాయతీలలోని రైతులకు చిరుధాన్యాల పెంపకం, చిరుధాన్యాలు వాడటం వల్లకలిగే ఆరోగ్య ప్రయోజనాలు, చిరుధాన్యాలను పండించే రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేయడం గురించి వివరించడం జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్యంగా పలమనేరు డివిజన్ వ్యవసాయశాఖ ఏడిఏ అన్నపూర్ణదేవి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల క్రితం కరోనా మహమ్మారి రావటం వల్ల అప్పుడు మన దగ్గర ఉన్నటువంటి సిరి ధాన్యాల పోషకాల వల్ల వాటిని తిని మనం చాలా వరకు ఆరోగ్యంగా ఉన్నామన్నారు. సజ్జలు, జొన్నలు, రాగులు ఊదలు, ఆరికలు, కొర్రలు అండు కొర్రలు, వరిగలు, సామలు తొమ్మిది రకాల చిరుధాన్యాలు ఉపయోగించడం వల్ల చాలావరకు షుగరు, బిపి, గుండె సంబంధిత, శ్వాస జీర్ణకోశ సంబంధిత, రక్తహీనత ఇతర చాలా రకాల రోగాలను ఈ సిరిధాన్యాలు వాడడం ద్వారా వాటిని తగ్గించుకోవచ్చని క్లుప్తంగా వివరించారు. వ్యవసాయ అధికారి నాగరాజు, జడ్పిటిసి కష్ణమూర్తి, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రస్తుత సంక్షేమ పథకాలన్నీ కాంగ్రెస్ పార్టీవే

మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

ప్రజాశక్తి- కుప్పం: రాష్ట్రంలో ప్రస్తుత సంక్షేమ పథకాలన్ని కాంగ్రెస్ పార్టీవేనని పేర్లు మార్చి పబ్బం గడుపుకొంటున్నారని మాజీ కేంద్ర మంత్రి, మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. ఈసందర్భంగా మంగళవారం కుప్పం మండల పరిధిలోని కంగుంది ఎస్సీకాలనీలో పర్యటించారు. అనంతరం కుప్పం ఆర్‌అండ్‌బి అతిథి గహంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ సురేష్‌బాబుకు కాంగ్రెస్ పార్టీలో మంచి భవిష్యత్ ఉందని, ఏ రోజుకైనా మంత్రి కాక తప్పదని అన్నారు. మంచి వ్యక్తిత్వం, కల్మషం లేని, మచ్చలేని నాయకుడు డాక్టర్ సురేష్ బాబు అన్నారు. కంగుంది ఎస్సీ కాలనీలో పేదలు వాడుతున్న బియ్యాను పరిశీలిస్తే ప్లాస్టిక్ బియ్యాన్ని వారికీ అందిస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో ప్లాస్టిక్ బియ్యాను సరఫరా చేస్తుంటే జిల్లా కలెక్టర్ ఏమి చేస్తున్నారని మండిపడ్డారు. పేదవాడికి ఇచ్చే ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్లాస్టిక్ బియ్యం ఇచ్చే హక్కు ఎవరు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు స్కాలర్ షిప్‌లు ఇచ్చిన ఘనత జవహర్ లాల్ నెహ్రూదని ఆ ఘనత కాంగ్రెస్ పార్టీదనీ.. ఆ పేరును మార్చుతూ కొత్త పేరును పెట్టి (జెవిడి)గా చెప్పుకుంటూ పబ్బం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా డిసిసి అధ్యక్షులు డాక్టర్ బిఆర్ డి.సురేష్ బాబు, జిల్లా ప్రచారకార్యదర్శి వెంకటరమణ బాబు, గుడుపల్లి డికే. చంద్రశేఖర్, కుప్పం రాజారామ్, కంగుంది అన్సర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: పంటసాగులో రైతులు సస్యరక్షణ పాటించినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారిణి హేమలత అన్నారు. మంగళవారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం పరిసర ప్రాంతాల్లో రైతులు సాగు చేసిన వరి, వేరుశెనగ, మిరప, రాగి పంటను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలను పాటించిండం వల్ల పంటసాగులో మంచి దిగుబడి సాధించడానికి అవకాశం ఉందన్నారు. మిరపపంట నాటిన ప్రతి 15రోజులు కొకసారి వేపనూనె పిచికారి చేయడం ద్వారా ముడత రోగం దూరమవుతుందన్నారు. జింకు లోపం నివారణకు ఆఖరి దుక్కిలో ఎకరానికి 20కిలోల జింజ్ సల్ఫేట్ ఎరువు వాడాలన్నారు. చెరకు, పంటలో ఇనుము దాతు లోపం ఉన్న ఆకులు పత్రహరితం కోల్పోయి లేత పసుపు రంగులో పాలిపోయినట్లు కనిపించినప్పుడు అన్నభేదిని 20 గ్రాములు, ఒక గ్రాము నిమ్మ ఉప్పు, ఒక లీటరు నీటి చొప్పున కలిపి పదిరోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలని సూచించారు. వేరుశనగ పంటలో ఆకుమచ్చ తెగులు నియంత్రణకు మాంకోజెబ్ 2 గ్రాములు పిచికారి చేయాలన్నారు. వేరుశనగ పంట అక్కడక్కడ ఎండిపోవడం, చనిపోయినట్లయితే వేరుకుళ్లు లేదా కాండం కుళ్లు తెగులు నియంత్రణకు సాఫ్ పొడి 25 గ్రాములు, బావిస్టిన్ 1 గ్రాము లీటరు నీటితో మొక్కలు తడిచేలా పిచికారి చేయాలన్నారు. ఏఈవోలు గాయత్రి, హేమాద్రి, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు నిషేధం : డిఆర్‌ఒ

ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఆర్‌ఒ రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు కాలుష్యనియంత్రణ మండలి, ప్రాంతీయ అధికారి నరేంద్రబాబు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌ఒ ఎన్.రాజశేఖర్ అధ్యక్షతన ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధంపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ప్లాస్టిక్ ఫ్లెక్సీల వాడకాన్ని కఠినంగా నిషేధించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నిషేధ ఆజ్ఞలను ఈనెల 26వ తేదీ ఘనతంత్ర దినోత్సవం నుంచి అమలు చేయాలన్నారు. నిషేధం అమలు చేసిన తరువాత చేపట్టిన చర్యలు, వివరాలు వారం చివర నివేధికలుగా జిల్లా యంత్రాంగానికి సమర్పించవల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఏఓ ఎన్.మనుద్దీన్ ఖాన్, కమర్షియల్ టాక్స్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ వై.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జి.చంద్రశేఖర్, జిల్లా రవాణా శాఖ ఏఓ ఆర్‌టిఓ పి. మురళీధర్, మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పి.గోవర్ధన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ బ్యానర్ల నిషేధంపై వార్డు కార్యదర్శులతో కమిషనర్ సమావేశం

జాతీయ హరిత ట్రిబ్యునల్ మార్గదర్శకాలు, ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఈనెల 26వ తేదీ నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు పూర్తిస్థాయిలో నిషేధిస్తున్నట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. మంగళవారం సాయంత్రం నగరపాలక పరిధిలో జరుగుతున్న పలు కార్యక్రమాలపై వార్డు కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు తయారీ, ఏర్పాటు చేయడాన్ని నిషేధిస్తున్నట్లు చెప్పారు. ఇదే విషయాన్ని వార్డు కార్యదర్శులు, అధికారులు ఆయా వార్డు పరిధిలోని ఫ్లెక్సీల తయారీదారులకు, ప్రింటర్ల యజమానులకు, వ్యాపారస్తులకు, స్థానిక రాజకీయ నాయకులకు అవగాహన కల్పించాలన్నారు. 26వ తేదీ తర్వాత సింగల్ యూస్ ప్లాస్టిక్ వినియోగించినా, ప్లాస్టిక్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా సత్వరం తొలగించడంతో పాటు, అపరాధరసం విధించాలన్నారు. నగరంలో డెంగీకేసులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఆస్తి పన్ను వసూలు నిర్ణీత లక్ష్యం మేరకు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు సింగల్ యూస్ ప్లాస్టిక్ వినియోగించరాదని నగరంలోని హోటల్స్, రెస్టారెంట్ యజమానులకు అవగాహన కల్పించారు. నిబంధనలు మీరి సింగల్ యూస్ ప్లాస్టిక్ వినియోగిస్తే అపరాధ రుధించడంతో పాటు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఏసీపీ రామకష్ణుడు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక స్తోమత లేకున్నా న్యాయసేవలు

జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కేసులకు సంబంధించి న్యాయవాదిని పెట్టుకోలేని స్తోమత లేని వారు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ద్వారా న్యాయం పొందవచ్చుననిజిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్‌జడ్జి డాక్టర్ ఐ.కరుణ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఓంకార్, జాతీయ నిర్మాణ శిక్షణసంస్థ సహాయ సంచాలకులు విజయ్ ప్రతాప్‌లతో కలసి ఇరువారం, విభిన్నప్రతిభావంతుల కాలనీలో జాతీయ నిర్మాణ శిక్షణసంస్థ శిక్షణ కేంద్రం నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్మికశాఖ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికులకు ఇశ్రామ్ కార్డ్స్ పంపిణీ, కార్డులు నమోదు ప్రక్రియపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కేసులకు సంబంధించి న్యాయవాదిని పెట్టుకోలేని, స్తోమత లేని ప్రజలు జిల్లా న్యాయసేవ అధికార సంస్థను సంప్రదించిన ఎడల వారికి న్యాయవాదిని నియమించి కేసులు పరిష్కారం చేయుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఓంకార్ మాట్లాడుతూ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల చట్టం 1996 మరియు ఆంధ్రప్రదేశ్ నిబంధనలు 1999 భవనం మరియు ఇతర రంగాలలో పనిచేయు కార్మికుల సంక్షేమంకు ఒక చట్టం తీసుకురావడం జరిగిందనన్నారు. 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల వయస్సులోపు ఉన్న భవనం, ఇతర నిర్మాణ రంగాలలో పనిచేయు కార్మికులు రూ.110ల రుసుం చెల్లించి, వయస్సు ధ్రువీకరణకు రేషన్‌కార్డు, ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, స్కూల్ సర్టిఫికెట్ జిరాక్స్‌కాపీని జతచేసి సంబంధిత కార్మిక శాఖాధికారిచే 5 సంవత్సరాలకు ఒకేసారి నమోదు చేయించుకోవచ్చునని అన్నారు. ఆతర్వాత రూ.60లు చెలించి 5 సంవత్సరాలకు ఒకేసారి రెన్యూవల్ చేయించుకోవచ్చునని తెలిపారు కార్యక్రమంలో జాతీయ నిర్మాణ శిక్షణ సంస్థ సహాయ సంచాలకులు విజయ్ ప్రతాప్ మాట్లాడుతూ సంస్థ ద్వారా కార్మికులకు ఎలక్ట్రికల్, తాపీపని, పెయింటింగ్, ప్లంబింగ్, బారు బైండింగ్, వడ్రంగి విభాగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని శిక్షణ కాలంలో రోజుకు రూ.300లు శిక్షణ భతి, ఉచిత భోజన సౌకర్యం కలిగించబడుతుందని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కరుణకుమార్

'లోకేష్ పాదయాత్ర చేస్తే అధికార పార్టీకి ఎందుకు భయం'

ప్రజాశక్తి- కుప్పం: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రకు 29షరతులతో పాదయాత్రను అడ్డుకోవాలని చూస్తే యాత్ర ఆగదని మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్ర కోసం జనవరి 9వ తేదీన అనుమతులు కోరితే 24వ తేదీ వరకు అనుమతులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి నారా లోకేష్ కుప్పం నుంచి చేపట్టనున్న యువగళం పాదయాత్రకు అనేక చిక్కుముళ్లతో పోలీసులు షరతులు పెట్టారని ఆయన చెప్పారు. 29షరతులతో కూడిన పోలీసులు ఇచ్చిన నోటీసులను తీసుకునేందుకు నిరాకరించినట్లు ఆయన వివరించారు. మంగళవారం ఉదయం పాదయాత్రకు 24, బహిరంగ సభకు 22 షరతులు విధించారని, ఇందుకు తాము నిరాకరించడంతో పాదయాత్ర, బహిరంగ సభలకు షరతులను 29కి కుదించారన్నారు. టపాకాయలు పేల్చరాదని, బ్యానర్లు కట్టరాదని, పాదయాత్రలో రోడ్డు లైన్ దాటరాదని అనేక షరతులతో యువగళంకు అడ్డుపెడుతున్నారని పేర్కొన్నారు. తాము పాదయాత్రకు 10గంటల వరకు అనుమతి కోరితే సాయంత్రం 5.55గంటల వరకు చేసుకోవాలని చెప్పడం దారుణమన్నారు. సభకు, పాదయాత్రకు ఎంతమంది వస్తారని అడగడం, పాదయాత్రలో అనుమతికి మించి వాహనాలు రాకూడదని చెప్పడం ఏమిటని, అభిమానంతో ప్రజలు ముందుకొస్తారన్నారు. పాదయాత్రలో జనాలు గుమిగూడకూడదని, సభల్లో శాంతి భద్రతలు నిర్వాహకులే చూసుకోవాలని షరతులు విధించారని, ఇవన్నీ మేమే చేస్తే పోలీసులు ఎందుకని ప్రశ్నించారు. 2017లో జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రకు అనుమతి కోరిన వెంటనే అప్పటి అధికార టిడిపి అనుమతితో పాటు భద్రత కల్పించిందన్నారు. టిడిపి ప్రభుత్వం నిబంధనలు పెట్టి ఉంటే పాదయాత్ర జరిగేదా అని ప్రశ్నించారు. ఓ వైపు అధికార పార్టీకి చెందిన మంత్రులు, నాయకులు నారా లోకేష్ పాదయాత్రకు అనుమతులు ఇచ్చామని చెబుతున్నారని.. తీరా పోలీసులను అడ్డుపెట్టుకొని ఆంక్షలతో పేరుతో కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఏది ఏమైనా యువగళం రాష్ట్ర ప్రజల కోసం కదులుతుందని మాజీ మంత్రి అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్సీలు రవిచంద్ర యాదవ్, శ్రీనివాసులు, జిల్లా పార్లమెంటు అధ్యక్షుడు పులివర్తి నాని తదితరులు ఉన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

నేడు మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

ప్రజాశక్తి-పులిచెర్ల: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం పులిచెర్ల మండలం మతుకువారిపల్లి, చల్లావారిపల్లి, పాతపేట, బోడిరెడ్డిగారిపల్లి, వెంకటదాసరపల్లి, దేవలంపేట, అయ్యావాండ్లపల్లి, రాజులపల్లి, దిగువపోకల వారిపల్లి పంచాయతీల్లో పర్యటించనున్నట్లు జడ్పీటీసీ సభ్యులు మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. ఈ పర్యటనలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్దిరెడ్డి అభిమానులు హాజరుకావాలని తెలిపారు.

కోగిలేరు సమీపంలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి- పెద్దపంజాణి: కోగిలేరు సమీపంలో అటవీప్రాంతంలో ఏనుగుల సంచరిస్తుండడంతో రైతులు, గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. సోమవారం రాత్రి మూడు ఏనుగులు కోగిలేరు సమీపంలో గల అటవీ ప్రాంతం నుండి హంద్రీనీవా కాలువ సమీపంలో వ్యవసాయ పంటలను మామిడి తోటలను ధ్వంసం చేసినట్లు స్థానిక రైతులకు గుర్తించి తెలిపారు. బాణాసంచా కాల్చినప్పటికీ ఏనుగులు వెళ్లలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో చాలా మంది రైతుల వ్యవసాయ పొలాలు అటవీ ప్రాంత సమీపంలోనే ఉండడంతో ఏ సమయంలో ఏనుగులు వస్తాయోనని వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లడానికి భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులైన స్పందించి ఏనుగులను ఇటువైపు రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి : కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న అభివద్ధి పనులను వేగవంతం చేయించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో ఎంఈ ధనలక్ష్మి, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్బన్ ఆరోగ్య కేంద్రాలు, గార్బేజ్ ట్రాన్స్ఫర్‌స్టేషన్‌ల నిర్మాణాలు వేగంగా పూర్తిచేయించాలని న్నారు. నగరపాలక పరిధిలో పాట్ హెూల్స్ సర్వే పూర్తిచేయించి టెండర్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. జగనన్న హరిత నగరాలు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయించాలని చెప్పారు. పనులవారీగా సమీక్ష నిర్వహించారు. నగరంలో నీటిసరఫరాలో ఎలాంటి అంతరాయాలు ఉండరాదని, నీటికి తప్పనిసరిగా క్లోరినేషన్ చేయించాలన్నారు. అనధికార కొళాయి కనెక్షన్ గుర్తించి తొలగించాలని, రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. నాగయ్య కళాక్షేత్రం మరమ్మతు పనులకు అంచనాలు రూపొందించి సమర్పించాలన్నారు. వీధిలైట్ల నిర్వహణ పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఏఈలు పాల్గొన్నారు.

'దళితుల మధ్య చిచ్చు పెడుతున్నారు..'

ప్రజాశక్తి- పలమనేరు: బైరెడ్డిపల్లి మండలం అలకుప్పం దళితుల మధ్య చిచ్చుపెడుతున్న అగ్రకుల, అహంకార, ఆధిపత్యాలను అరికట్టాలని జాతీయ మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ నాయకులు సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. అందులో భాగంగా మంగళవారం పలమనేరు పట్టణంలో గల జాతీయ మానవహక్కుల కార్యాలయంలో రవికుమార్ అధ్యక్షతన అలకుప్పం విషయంపై అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు డివి.మునిరత్నం, వేలాయుధం మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని దళితవాడలో నెలకొల్పిన విషయాన్ని జీర్ణించుకోలేని అగ్రకుల ఆధిపత్య కులాలు, దళితుల్లోనే కొంతమందిని చీల్చి వారికి అనుకూలంగా మలుచుకొని దళితుల మధ్య గొడవలు రేపి చోద్యం చూడడం సమంజసం కాదని మండిపడ్డారు. ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసు అధికారులు నామమాత్రంగా విచారణ జరిపి సమస్య పరిష్కారమే అయిపోయినదని చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. కుల వివక్ష కూకట వేళ్లతో పెకిలించాలంటే చట్టాలను ప్రతిష్టంగా అమలు పరచాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామంలో ఉన్న అన్ని కులస్తులతో సంప్రదింపులు జరిపి గ్రామాల్లో ఆధిపత్యం కోసం పాకులాడుతున్న వారిపై చర్యలు తీసుకుని దళితులకు రక్షణ కల్పించి గ్రామాన్ని ప్రశాంతమైన వాతావరణంలో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో పార్థసారథి, రాజామణి, కవిత, నరసింహులు, మునిరత్నం, రామచంద్ర, నాగరాజు, వెంకటరమణ, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత.. జీవితానికి రక్షణ...

ప్రజాశక్తి- వికోట: రహదారి భద్రత ప్రతి మనిషి జీవితానికి రక్షణ కనిపిస్తుందని పలమనేరు ఎంవిఐ మధుసూదన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణాశాఖ వారి 34వ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా చిత్తూరు జిల్లా ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఎం.బసిరెడ్డి ఆదేశానుసారం మంగళవారం వి.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలలో పాల్గొని మంచి ప్రతిభ చూపిన 34 మంది విద్యార్థులకు మొదటి బహుమతి, పోటీలలో పాల్గొన్న దాదాపు 400 మంది విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈసందర్భంగా పలమనేరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వి.మధుసూధన్ మాట్లాడుతూ జీవితం చాలా విలువైనదని, చిన్నపాటి ఆవేశాలతో ప్రమాదాలకు గురికావద్దని తెలియజేశారు. వి.కోట సర్కిల్ఇన్స్పెక్టర్ జి.ప్రసాద్ బాబు మాట్లాడుతూ తప్పనిసరిగా ప్రతిఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటిస్తూ విజయవంతమైన జీవితానికి తోడ్పడాలని తెలియజేశారు. కళాభారతి ఫౌండేషన్ అధినేత డాక్టర్ రఘుపతి, ఎండి పవన్ కళ్యాణ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గాయత్రి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బంగారు పతకం అందుకున్న జవహర్

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: తిరుపతి జిల్లా శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఉన్న శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గత రెండు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి 66వ స్క